

చంద్రబాబుకు భారీ స్వాగత ఏర్పాట్లు

అక్రమ కేసుల్లో 53 రోజుల పాటు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో నిర్బంధానికి గురై విడుదలై వెళ్లిన తర్వాత తొలిసారిగా జిల్లాకు వస్తున్న నారా చంద్రబాబునాయుడుకు ఘన స్వాగతం పలకడానికి నేతలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. నెల్లూరు జిల్లా నుంచి ప్రత్యేక విమానంలో మధురపూడి విమానాశ్రయానికి చంద్రబాబు చేరుకుంటారు. అక్కడ ఆయనకు ఘన స్వాగతం పలకనున్నారు. అక్కడ నుంచి కారులో నేరుగా సభా వేదిక వద్దకు చేరుకుంటారు.

నేడే.. రా కదలిరా!

- కాతేరులో బహిరంగ సభ
- ఉదయం 11 గంటలకు ఆరంభం
- 2 లక్షల మంది వస్తారని అంచనా
- 23 ఎకరాల్లో భారీ ఏర్పాట్లు

రాజమహేంద్రవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇక కొద్ది రోజుల్లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల శంఖారావం పూరించడానికి తూర్పుగోదావరి సిద్ధమైంది. వచ్చే ఎన్నికలకు కేడర్, ప్రజలను సిద్ధం చేయడానికి, ప్రజా వ్యతిరేక విధానాలతో రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేసిన అధికార వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సోమవారం తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా అంటూ టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపుఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రతి జిల్లాలోనూ జిల్లా స్థాయి బహిరంగ సభలు ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని కాతేరులో సోమవారం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. లక్షలాది మందికి స్వాగతం పలకడానికి కాతేరు గ్రామం ముస్తాబైంది. తూర్పుగోదావరి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సభ జరగ నుంది. గోదావరి ఫోర్త్ బ్రిడ్జి సమీపంలోని కాతేరులోని తిరుమల విద్యా సంస్థల సమీపంలోని 23 ఎకరాల విశాలమైన లే అవుట్‌లో బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు చేశారు. పెద్ద వేదికతో పాటు సభకు హాజరయ్యేవారికి ఇబ్బందిలేకుండా బారికేడ్లతో గ్యాలరీలు ఏర్పాటు చేశారు. వేదిక మీద సుమారు 100 మంది కూర్చునేలా సిద్ధం చేశారు. వేదిక ముందు 10 వేల మంది వీఐపీలు కూర్చునేలా కుర్చీలు వేసి ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశారు. మరోపక్క మీడియాకు ఏర్పాట్లు చేశారు. 2 లక్షల మంది పట్టే విధంగా విశాలమైన గ్రౌండ్‌ను సిద్ధం చేశారు. ప్రాంగణం ఫ్లెక్సీలు, పసుపు జెండాలతో ధగధగ వెలిగిపోతోంది. సమీపంలోని తిరుమల కాలేజీ ప్రక్కన హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి సుమారు 2 లక్షల మంది హాజరవుతారని సమాచారం. ఒక్కో నియోజకవర్గం నుంచి 30 వేల మంది వచ్చేటట్టు ఆయా నేతలు బాధ్యతలు తీసుకున్నారు. పార్కింగ్ ఇబ్బందులు లేకుండా ఆయా నియోజకవర్గాలకు వేర్వేరుగా ఏర్పాట్లు చేస్తున్నారు. సభ ఉదయం 10గంటలకే ప్రారంభమవుతుంది. చంద్రబాబు సుమారు 11.25 గంటలకు సభకు చేరుకుని, ఒంటి గంటకు ఉపన్యాసం ముగిస్తారు. సభ ఏర్పాట్లను మూడు రోజుల నుంచి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, శాసనమండలి విపక్ష నేత యనమల రామకృష్ణుడు, మాజీ డిప్యూటీ సీఎం నిమ్మకాయల చినరాజప్ప, మాజీ మంత్రులు కేఎస్ జవహర్, ప్రత్తిపాటి పుల్లారావు, గుడా మాజీ ఛైర్మన్ గన్ని కృష్ణ, జోన్-2 పరిశీలకుడు మందలపు రవి తదితరులు పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం కూడా వారు ఇక్కడే ఉండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. సభకు టీడీపీ, జనసేన క్యాడర్ తరలిరానుంది.

నెల్లూరు జిల్లాలో పర్యటన ముగించుకుని ఉదయం 11.15 గంటలకు ప్రత్యేక విమానంలో రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వస్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన 11.25 గంటలకు బయలుదేరి కాతేరులోని మల్లు లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు వస్తారు. 11.45నుంచి ఒంటి గంట వరకు బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం 1.50 గంటలకు బయలుదేరి కాతేరులో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 2గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి గుంటూరు జిల్లా చేబ్రోలు మండలంలోని వడ్లమూడి గ్రామం వెళతారు.



తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా సభకు సిద్ధమవుతున్న ప్రాంగణం



ఫ్లెక్సీల ఏర్పాటు



సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రులు యనమల, చినరాజప్ప, గోరంట్ల, జవహర్ తదితరులు



శ్రీరామ్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

అమలాపురంలో బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

- నల్లా పవన్‌పై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన నార్ని శ్రీరామ్
- అడ్డుకున్న పవన్ వర్గీయులు
- పోలీసుల రంగప్రవేశం
- పవన్‌పై భూకబ్జా ఆరోపణలు చేస్తున్న శ్రీరామ్‌ని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడే కారణమంటూ పవన్ వర్గీయుల మోహరింపుతో ఉద్రిక్తత
- ఇరువర్గాలను చెదరగొట్టిన పోలీసులు
- ఘటనపై ఫిర్యాదు చేస్తానన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దొరబాబు



అమలాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఎ.నారాయణస్వామి సమక్షంలో అమలాపురంలోని బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద ఆదివారం రాత్రి ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. మంత్రి మీడియాతో మాట్లాడుతున్న సమయంలో ఓ యువకుడి కోసం తలెత్తిన వివాదం రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీయడంతో పోలీసులురంగప్రవేశం చేసి అదుపులోకి తెచ్చారు. అమలాపురంలోని నల్లవంతెన-ఎర్రవంతెన మధ్య కాటన్ పార్క్ రోడ్డులో ఉన్న కోనసీమ బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద ఆదివారం రాత్రి ఈ వివాదం చోటుచేసుకుంది. కేంద్ర మంత్రి నారాయణస్వామి జిల్లా పర్యటనలో భాగంగా అమలాపురం బీజేపీ కార్యాలయంలో రాత్రి ఏడు గంటల సమయంలో మీడియాతో మాట్లాడుతున్నారు. బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ నాయకుడైన నల్లా పవన్ సమీప బంధువు ఒక్కరూ బీజేపీ కార్యాలయానికి వచ్చి మంత్రిని కలిసేందుకు వేచియున్నారు. అయితే పవన్ తనకు చెందిన భూమిని దౌర్జన్యంగా తీసుకున్నారని ఆరోపిస్తూ కొంత కాలం నుంచి సోషల్ మీడియాలో ప్రచారం చేయడంతో పాటు ఈ ప్రాంతానికి వచ్చిన ప్రతి నాయకుడిని కలిసి వినతిపత్రాలు ఇవ్వడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో నార్ని శ్రీరామ్ అనే యువకుడు తనపై మంత్రికి ఫిర్యాదు చేసేందుకు వచ్చాడని భావించిన పవన్‌తో పాటు అతడి అనుచరులు అక్కడికి హుటాహుటిన చేరుకున్నారు. మొదటి అంతస్తులో మంత్రి నారాయణస్వామి మీడియాతో మాట్లాడుతుండగా వెనుక భాగంలో ఘర్షణపూరిత వాతావరణం నెలకొంది. ఆ యువకుడినిపవన్ అనుచరుల్లో ఒక్కరైన రంకిరెడ్డి రామలింగేశ్వరరావు నిలదీయడంతో శ్రీరామ్ అతడిపై తిరగబడ్డాడు. దాంతో అతనని బయటకు తీసుకుని వెళ్లారు. అప్పటికే పోలీసులకు బీజేపీ నాయకులు సమాచారం అందించడంతో వారు వెంటనే బీజేపీ కార్యాలయానికి చేరుకున్నారు. వివాదం తీవ్రమవుతుడడంతో మంత్రి నారాయణస్వామి అక్కడి నుంచి బయలుదేరి వెళ్లిపోయారు. ఈ తరుణంలో బీజేపీ కార్యకర్తగా చెలామణి అవుతూ తనపై ఆరోపణలు చేస్తున్న నార్ని శ్రీరామ్‌పై పవన్ అనుచరులు తిరుబాటు చేస్తున్న తరుణంలో పోలీసులు శ్రీరామ్‌ను అదుపులోకి తీసుకుని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్టు సమాచారం. అయితే వివాదం వెనుక ప్రస్తుత బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ప్రోద్బలం ఉందన్న ఆరోపణతో పవన్ వర్గీయులు భారీగా మోహరించారు. మరోవైపు యాళ్ల దొరబాబు అనుచరులు కూడా కార్యాలయానికి చేరుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తనున్న నేపథ్యంలో పట్టణ సీఐ క్రిష్టోఫర్ ఆధ్వర్యంలో పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. దాంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ప్రస్తుతం నార్ని శ్రీరామ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ వివాదంపై పట్టణ పోలీసులు ఫిర్యాదు చేయనున్నట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దొరబాబు తెలిపారు.

నేడు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల ధర్నా

అమలాపురం టౌన్, జనవరి 28: ప్రతినెలా ఒకటో తేదీనే పెన్షను చెల్లించాలని, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం వద్ద బకాయిలను వెంటనే చెల్లించాలన్న ప్రధాన డిమాండ్లతో దశలవారీ ఆందోళనలో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నట్టు పెన్షనర్లు ప్రకటించారు. సమస్యల పరిష్కారం కోరుతూ నిర్వహించే ధర్నాలో అందరూ పాల్గొనాలని పెన్షనర్ల సంఘం జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పారుపూడి కృష్ణశాస్త్రి, కేకేవీ నాయుడు కోరారు.



వైపీ పాలెంలో నదీపాయకు అడ్డంగా వేసిన బాట

తవ్వకాలకు హద్దులేదీ!

ఇసుక తవ్వకాలకు ఏ సంస్థకు అనుమతి ఇచ్చారు... మట్టి తవ్వకాలకు ఏ సంస్థకు అనుమతి ఇచ్చారు. వారి పరిధి ఏమిటి... సీనరేజీ ఎవరికి చెల్లించాలి... ఇసుకకి, మట్టికి అనుమతులు మంజూరు చెయ్యడంలో మైన్స్ శాఖతో పాటు ఇతర శాఖల పాత్ర ఏమిటి... ఇలా ఎన్నో ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అయితే వీటికి అధికారుల వద్ద సమాధానాలు లేవు. ఒకవేళ వారు జవాబు చెప్పినా సారాంశం మాత్రం సంతృప్తికరంగా ఉండట్లేదు. గత నాలుగేళ్లుగా ఇసుక అందుబాటులో లేక సామాన్యుడు నానా అవస్థలు పడుతుంటే ప్రభుత్వం స్పందించట్లేదు. పైగా ఇసుక, మట్టి తవ్వకాలను దళారులకు వ్యాపార సంస్థలుగా మార్చేసింది. దీనికి తోడు ప్రభుత్వ పెద్దలు ఇసుక తవ్వకాలను ఏడాదికో సంస్థలకు అప్పగిస్తూ ప్రజలను అయోమయంలో పడేస్తోంది. ప్రస్తుతం ఇసుక, మట్టి ర్యాంపుల్లో ఇదే జరుగుతోంది. ఇసుక, మట్టి, తువ్వ కూడా మాదే అని ఓ సంస్థ అంటుంటే.... మరో సంస్థ మాత్రం మట్టి మాత్రమే మా సంస్థకు చెందుతుందని వాదిస్తూ ర్యాంపుల్లోనే పంచాయతీలు పెట్టుకుంటున్నాయి. ఇంత జరుగుతున్నా ఏ సంస్థకు ఎంతమేర అనుమతులు ఉన్నాయో చెప్పలేని పరిస్థితుల్లో సంబంధిత అధికారులు ఉన్నారని స్థానికులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

- మాదంటే మాదంటూ పోటీపడుతున్న రెండు సంస్థలు
- ర్యాంపుల్లో రెండు బిల్లులు
- అనుమతులపై స్పష్టత ఇవ్వని సంబంధిత అధికారులు
- జోరుగా సాగుతున్న ఇసుక, మట్టి ర్యాంపులు
- బోట్స్‌మెన్ ర్యాంపులో డ్రెడ్జర్‌తో తవ్వకాలు

పి.గన్నవరం, జనవరి 28: గోదారమ్మ ఏటా నదీ పరివాహక ప్రాంతాల్లో కొంతమేర ఇసుక, మట్టి, తువ్వమట్టిని వరదలకు తీసుకొస్తుంది. అయితే నేడు ఈ ప్రకృతి అందించిన సంపద నేడు దళారాలకు వరంగా మారింది. దీంతో గనుల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఖజానాకు చెల్లించవల్సిన సీనరేజీని ప్రైవేటు సంస్థలకు చెల్లించాల్సి వస్తోంది. లీజు పేరుతో అడ్డగోలు అనుమతులుముసుగులో జరుగుతున్న అక్రమ తవ్వకాలతో ప్రభుత్వానికి వేల కోట్లు గండిపడుతోంది. ఈ క్రమంలోనే గతేడాది ఏప్రిల్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండేళ్ల పాటు ఖనిజజాల నుంచి సీనరేజీ ఫీజు వసూలు చెయ్యడానికి ఆన్‌లైన్‌లో బిడ్‌లను సుధాకర్ ఇన్‌ఫ్రాటెక్ దక్కించుకుంది. అయితేఅప్పట్లో ఇసుకకు జేపీ, మట్టికి సుధాకర్ ఇన్‌ఫ్రా ఫీజు కట్టించుకుని బిల్లులు అందించేవి. అయితే కొన్ని రోజులు తర్వాత అవి రెండూ ఏకమై ఇసుక, మట్టిని మొత్తం దోచేశాయని విమర్శలు కూడా ఉన్నాయి. ఈ ఏడాది జేపీ కనుమరుగైపోవడంతో కొత్తగా ప్రతిమ అనే సంస్థ ఇసుకను తవ్వుకునేందుకు తెరమీదకు వచ్చింది. దీంతో ఇసుక ర్యాంపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఎన్‌వోసీ ముసుగులో వర్క్ ఆర్డర్ల పేరుతో ర్యాంపులు ప్రారంభించి అమ్మకాలు మొదలు పెడుతున్నారు. అయితే ఇటీవలే మండలంలో వర్క్ ఆర్డర్ల ముసుగులో నడుస్తున్న ర్యాంపుల్లో ప్రతిమ సంస్థ పాగావేసి ఇసుకతో పాటు తువ్వ మట్టి, నల్ల మట్టి కూడా మాదేనని, బిల్లులను తమ సంస్థే మంజూరు చేయాలని చెప్పి లారీలను అడ్డుకుంది. సుధాకర్ ఇన్‌ఫ్రా సంస్థ ప్రతిఘటించినా ఫలితం లేకపోవడంతో కొన్ని రోజులు పాటు ఒక ర్యాంపు మినహా మిగిలిన ర్యాంపులన్నీ మూతపడ్డాయి. ఈ రెండు సంస్థల పంచాయతీ కొంతమేర కొలిక్కి రావడంతో ర్యాంపుల్లో అక్రమ తవ్వకాలు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఇది ఇలా ఉంటే.. అసలు జిల్లాలో ఎన్ని ర్యాంపులకు అనుమతులిచ్చారు. నిబంధనలు అనుసరించి ర్యాంపులు నడుస్తున్నాయా అనే అంశాలకు సంబంధించి సంబంధిత అధికారులు వద్ద వివరణ కోసం ప్రస్తావిస్తే వారి వద్ద నుంచి సరైన సమాధానం రాకపోవడం గమనార్హం. అంతే కాకుండా ఆయా సంస్థలకు అనుమతులు ఎంతమేర ఉన్నాయో అధికారుల నుంచి స్థానిక ప్రజలు ప్రజలు స్పష్టత కోరుతున్నారు.

బోట్స్‌మెన్ ఇసుక ర్యాంపుల్లో డ్రెడ్జర్లు

గోదావరి పరివాహక లంక ప్రాంతాల్లో ఇసుక, మట్టి తవ్వకాలకు హద్దుల్లేకుండా పోయాయి. కనీస నిబంధనలు పాటించకుండా యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు. రెవెన్యూ, మైన్స్ అధికారులతో పాటు సంబంధిత అధికారుల ఉమ్మడి నివేదికతో పనిలేకుండా హద్దుమీరి తవ్వకుపోతున్నారు. మట్టి ర్యాంపులతో పాటు ఇటీవలే అక్విడెక్టుకు ఇరువైపులా బోట్స్‌మెన్ ర్యాంపులు ప్రారంభించారు. లంకలగన్నవరం వైపు సమీపంలోని వ్యవసాయ భూములకు రక్షణగా ఉన్నమట్టి దిబ్బలను సైతం కొల్లగొట్టి ర్యాంపు తయారు చేశారు. ఈ ర్యాంపులో నిబంధనలకు విరుద్ధంగా గోదావరి నదిలో డ్రెడ్జర్లు ఏర్పాటు చేసి ఇసుకను బయటకు తీస్తున్నారు. ఒక్క రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో తప్ప కోనసీమ ప్రాంతంలో ఇప్పటి వరకు డ్రెడ్జర్‌తో ఇసుక తవ్వకాలు జరపడానికి అనుమతులు ఇచ్చిన దాఖలాలు లేవు. కాగా ఇదే విషయమై అధికారులను ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పుకొస్తున్నారు. అధికారులు కనీసం పర్యవేక్షణ లేకపోవడంతో నిబంధనలకు విరుద్ధంగా చెరువులు తలపించే విధంగా తువ్వ మట్టిని తవ్వుకుపోతున్నారు. ఇసుక, మట్టి,తువ్వమట్టి ర్యాంపుల విషయంలో ప్రభుత్వం, సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. అంతే కాకుండా ఇంతా జరుగుతున్నా ప్రతిపక్ష పార్టీల నాయకులు జోగుతుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మట్టికి సుధాకర్ ఇన్‌ఫ్రా సంస్థ ఇస్తున్న బిల్లు



బొండు ఇసుకకు ప్రతిమ కంపెనీ ఇచ్చే బిల్లు



వైపీ పాలెం ర్యాంపులో బిల్లులు ఇచ్చేందుకు జాగా ఏర్పాటు చేసుకున్న ప్రయివేటు సంస్థల ప్రతినిధులు



లంకలగన్నవరం బోట్స్‌మెన్ ర్యాంపులో ఇసుక తవ్వకాలకు సిద్ధంగా ఉన్న డ్రెడ్జర్లు



కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో సెర్ప్ ఉద్యోగులు

సర్వీసు క్రమబద్ధీకరించాలి

ఆరో రోజుకు సెర్ప్ ఉద్యోగుల నిరవధిక సమ్మె

అమలాపురం టౌన్, జనవరి 28: తమ సమస్యలను పరిష్కరించాలని మూడేళ్లుగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారానికి నోచుకోకపోవడంతో నిరవధిక సమ్మెకు దిగినట్టు సెర్ప్ ఉద్యోగుల జేఏసీ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.వరాలబాబు, ముత్తాబత్తుల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల్లోని సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న తమను ప్రభుత్వం గుర్తించట్లేదన్నారు. సెర్ప్ ఉద్యోగుల నిరవధిక సమ్మె ఆదివారం ఆరో రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరాన్ని అయినవిల్లి, అమలాపురం మండలాల వీఏవోలు సందర్శించి సంఘీభావం తెలిపారు. తెలంగాణ తరహాలో ఉద్యోగులకు కేడర్ ఫిక్సేషన్ చేయాలని, అన్ని కేడర్లకు పదోన్నతులు కల్పించాలని, ఫైనాన్స్ డిపార్టుమెంటు వద్ద ఫైళ్లకు జీవోలు ఇవ్వాలని డిమాండు చేశారు. ఐక్య కార్యాచరణ సమితి ప్రతినిధులు పీవీవీ రమణ, ఎంఎల్‌బీ విజయకుమారి, డి.అజయ్, కేవీబీ ప్రసాద్, ఎం.నాగవేణి, ఆర్.అర్జున్, ఎం.రమేష్, ఏవీబీ సురేంద్ర, నక్కా నాగవేణి, కె.వెంకటలక్ష్మి, పీవీ విశ్వనాథం, బి.వర్మ, ఎ.రఘురామ్, దేవుడు తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ పోటీలకు అంపైర్‌గా శ్రీనివాసరావు



అమలాపురం టౌన్, జనవరి 28: భారత క్రీడా మంత్రిత్వ శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ పోటీలకు అమలాపురం శివారు కొంకాపల్లికి చెందిన పాయసం శ్రీనివాసరావును అంపైర్‌గా నియమించారు. కేంద్రపాలిత ప్రాంతాలతో కలిపి 36 టీములు 26 క్రీడా విభాగాల్లో ఈ పోటీల్లో పాల్గొంటాయి. ఈ నెల 30వ తేదీ వరకు జరిగే బ్యాడ్మింటన్ క్రీడకు రాష్ట్రం నుంచి అంపైర్‌గా శ్రీనివాసరావుకు అవకాశం దక్కింది. నల్లచెరువు జడ్పీ ఉన్నత పాఠశాల పీడీగాపని చేస్తున్న శ్రీనివాసరావును బీవీసీ విద్యా సంస్థల అధినేత బోనం కనకయ్య, ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ కార్యదర్శి రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, హెచ్ఎం అక్కల వెంకట్రావు తదితరులు అభినందించారు.

'రాష్ట్రంలో అధ్వాన పరిస్థితి నెలకొంది'

అమలాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాలన అధ్వానంగా ఉందని, ఎటువంటి అభివృద్ధి జరగలేదనికేంద్ర మంత్రి ఎ.నారాయణస్వామి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే డీఏలు, ఇతర అలవెన్సులు ప్రభుత్వ ఉద్యోగులకు సక్రమంగా అందట్లేదని ఆయన ధ్వజమెత్తారు. అమలాపురంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం రాత్రి జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల వెంకటరామమోహనరావు(దొరబాబు) అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడారు. బుడగ జంగాలు, చెంచు జాతులకు ఎస్సీ హోదా కల్పించాలని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా కేంద్రమంత్రిని కోరారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు పాలూరి సత్యానందం, అడబాల సత్యనారాయణ, పొట్లూరి రామ్మోహనరావు, నల్లా పవన్‌కుమార్, మాలే శ్రీనివాసనగేష్, మోకా వెంకటసుబ్బారావు, యిళ్ల సత్యనారాయణ, దూరి రాజేష్, చిట్టూరి రాజేశ్వరి, కొండేటి ఈశ్వర్‌గౌడ్, నందూరి శ్రీరామ్, బొంతు శివాజీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రిని దొరబాబు ఆధ్వర్యంలో సత్కరించి అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరించారు.



ఓపీఎస్ సాధిద్దాం!

ఓపీఎస్ మన హక్కు.. పోరాడదాం.. సాధించుకుందాం.. సీపీఎస్.. జీపీఎస్ మనకెందుకు.. జీపీఎస్ ఇచ్చే పార్టీలకే ఓటేద్దాం అంటూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఓపీఎస్ రాష్ట్ర వ్యాప్త సాధన సభను ఆదివారం ఓట్ ఫర్ ఓపీఎస్ నినాదంతో రాజమహేంద్రవరంలో నిర్వహించారు.ఈ సభకు సుమారు 5 వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తరలివచ్చారు.. ఫిబ్రవరి 1 నుంచి ఉద్యమ కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు. - వివరాలు 6లో



రాముడు గెలిచాడు

జై శ్రీరామ్.. .జై శ్రీరామ్ నినాదాలతో రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం మార్మోగింది. హిందూ సంగమ సభ ఆదివారం ఘనంగా జరిగింది.. 500 ఏళ్ల తరువాత రాముడు గెలిచాడని కాకినాడ శ్రీ పీఠం స్వామీజీ పరిపూర్ణానంద సరస్వతి అన్నారు. మాత మార్పిడులను అరికట్టాలన్నారు. ఈ సభకు పెద్ద ఎత్తున హిందువులు తరలివచ్చారు. ప్రాంగణం అంతా జై శ్రీరామ్ నినాదాలతో ఉన్న కాషాయం జెండాలతో నిండిపోయింది.. - వివరాలు 6లో



జేఎన్టీయూకే పట్టాల పండుగ

రాష్ట్రంలో అతిపెద్ద సాంకేతిక విశ్వవిద్యాలయమైన కాకినాడ జేఎన్టీయూకే 10వ స్నాతకోత్సవాన్ని ఈనెల 31న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 10వ స్నాతకోత్సవ నిర్వహణకు ఇప్పటికే విశ్వవిద్యాలయ కులపతి, గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఏపీఎస్సీహెచ్ఈ ఛైర్మన్ కె.హేమ చంద్రారెడ్డి ఆమోదం తెలిపారు.

- 31న జేఎన్టీయూకే పదో స్నాతకోత్సవం
- హాజరుకానున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్
- టీసీఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు వర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం
- వర్సిటీ ఆవరణలో చురుగ్గా ఏర్పాట్లు

గవర్నర్‌కు ఆహ్వాన పత్రిక

జేఎన్టీయూకే, జనవరి 28: 2008లో విశ్వవిద్యాలయంగా రూపుదిద్దుకున్న జేఎన్టీయూకే మొదటి ఉపకులపతిగా అల్లం అప్పారావు, రెండో వీసీగా జి.తులసీరామ్‌దాస్, 3వ వీసీగా వీఎస్ఎస్‌కుమార్, 4వ వీసీగా ఎం.రామలింగరాజు వ్యవహరించగా 5వ వీసీగా ప్రస్తుతం జీవీఆర్ ప్రసాదరాజు కొనసాగుతున్నారు. స్నాతకోత్సవానికి కులపతి హోదాలో హాజరు కావాలని వీసీ జీవీఆర్ ప్రసాదరాజు ఆధ్వర్యంలోని వర్సిటీ బృందం రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు ఆహ్వానపత్రికను అందించింది. మాజీ ఉపకులపతి అల్లం అప్పారావు హయాంలో జేఎన్టీయూకే 1వ స్నాతకోత్సవాన్ని, డాక్టర్ జి.తులసీరామ్‌దాస్ హయాంలో 2,3,4వ స్నాతకోత్సవాలను, వీఎస్ఎస్ కుమార్ హయాంలో 5, 6వ స్నాతకోత్సవాలను, ఎం.రామలింగరాజు హయాంలో 7వ స్నాతకోత్సవాన్ని నిర్వహించగా ప్రస్తుత ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్‌ప్రసాదరాజు హయాంలో 8,9వ స్నాతకోత్సవాలను ఇప్పటికే నిర్వహించగా ఈనెల 31న పదో స్నాతకోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



అతిథులు వీళ్లే..

జేఎన్టీయూకే కులపతి, రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. మాజీ నేవీ రియర్ అడ్మిరల్ ఎస్.వెంకటశేషాచారి ముఖ్య అతిథిగా విచ్చేసి స్నాతకోత్సవ ఉపన్యాసం ఇస్తారు. ప్రత్యేక అతిథిగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పాల్గొంటారని వర్సిటీ వర్గాలు తెలిపాయి. జేఎన్టీయూకే తరఫున గౌరవ డాక్టరేట్‌ను టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు ప్రదానం చేయనున్నారు. అంతే కాకుండా స్నాతకోత్సవానికి మాజీ ఉపకులపతులు, పాలక మండలి సభ్యులు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, ఉన్నత విద్యాశాఖ అధికారులు, జిల్లాలోని అధికారులు, విద్యావేత్తలు, పూర్వ విద్యార్థులను ఆహ్వానించినట్లు తెలిపారు.

టీసీఎస్ ప్రెసిడెంట్‌కు గౌరవ డాక్టరేట్

ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు, ఉపకులపతి.



వర్సిటీ స్నాతకోత్సవం సందర్భంగా టీసీఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నాం. ఇది ప్రతీ విద్యార్థి జీవితంలో మరచిపోలేని వేడుక కులపతి హోదాలో హాజరవుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా విద్యార్థులకు పట్టాలు, పతకాలు, పరిశోధక విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు అందజేయనున్నారు. స్నాతకోత్సవాన్ని ప్రణాళికాబద్ధంగా విజయవంతంగా నిర్వహించేందకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

పట్టాల ప్రదానం ఇలా..

10వ స్నాతకోత్సవంలో 2022-23 విద్యా సంవత్సరాలకు సంబంధించి బీటెక్-34199, బీఫార్మసీ 1477, బీబీఏ-21, ఫార్మా డీ-182, బీఆర్క్-18 మొత్తం యూజీలో 35,897 (ఒరిజినల్ డిగ్రీ) పట్టాలను ప్రదానం చేయనున్నారు. అదే విధంగా ఎంటెక్-1689. ఎంబీఏ-1093, ఎంసీఏ-343, ఎం ఫార్మసీ-32 మొత్తం పీజీలో 1468 ఓడీ పట్టాలను, 24 మంది విద్యార్థులకు బంగారు, 4 నగదు పతకాలను, సుమారు 64 మందికి పీహెచ్‌డీ పట్టాలను అతిథుల చేతుల మీదుగా అందజేయనున్నారు. స్నాతకోత్సవంలో పట్టాలు తీసుకునేందుకు 4 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

ఓపీఎస్ ఇచ్చే పార్టీలకే ఉద్యోగుల ఓటు

- సీపీఎస్, జీపీఎస్ తెచ్చిన వారిని ఓడించాలి
- ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెన్షన్ భిక్ష కాదు హక్కు
- ఫిబ్రవరి 1 నుంచి ప్రత్యక్ష ఉద్యమ కార్యాచరణ
- ఓట్ ఫర్ ఓపీఎస్ సభలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, యూటీఎఫ్ నేతలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 28 : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెన్షన్ భిక్ష కాదు హక్కు అని, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరించే రాజకీయ పార్టీలకే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయనున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రాష్ట్రవ్యాప్త పాత పెన్షన్ సాధన సభ నిర్వహించారు. ఓట్ ఫర్ ఓపీఎస్ అంటూ నినాదాలు చేశారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్ తెచ్చిన వారిని ఓడించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల న్యాయమైన ఆందోళనా కార్యక్రమాలను ప్రభుత్వం పోలీసుల సహకారంతో అణచివేయాలనుకోవడం సరికాద న్నారు. ఉపాధ్యాయులను హేబిట్యువల్ అఫెండర్స్ (అలవాటైన నేరస్తులు)గా పరిగణించడం దారుణమని అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఓపీఎస్‌ను తమ మేనిఫెస్టోలో చేర్చడంతో పాటు మొదటి సంతకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీపీఎస్ డొల్ల అని, గ్యారంటీ లేని పెన్షన్‌కు గ్యారంటీ అని పేరు పెట్టడం విడ్డూరమని అన్నారు. ఉపాధ్యాయులంతా ఫిబ్రవరి 1 నుంచి ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 12 నుంచి మండల స్థాయిలో, 18 నుంచి 21వ తేదీ వరకూ నియోజకవర్గ స్థాయిలో, 25 నుంచి 28వ తేదీ వరకూ జిల్లాస్థాయిలో అన్ని రాజకీయ పార్టీల నాయకులను కలిసి వినతిపత్రాలు అందజేయాలని చెప్పారు. మార్చి 15 తర్వాత చర్చా వేదికలు నిర్వహిస్తామన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం మాట్లాడుతూ పాత పెన్షన్ సాధనకు జరిగే పోరాటానికి సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీవీఎస్ శర్మ మాట్లాడుతూ ఓట్ ఫర్ ఓపీఎస్‌కు ఏ రాజకీయ పార్టీ నుంచి మద్దతు లభించకపోతే శాసనసభలకు సొంతంగా ప్రతినిధులను పంపేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విశాలమైన ప్రజా సమీకరణతో ఎవరు ముఖ్యమంత్రి అవ్వాలో నిర్ణయించే శక్తిగా మారాలని సూచించారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడారు. వివిధ ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు మనోహర్, అరుణకుమారి, గోపి, మూర్తి, జ్యోతిబసు, సీపీఎం, ఆమ్ ఆద్మీ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన ఉద్యోగులు, సంఘాల నేతలు

ధర్మవరంలో రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న వరుపుల సుబ్బారావు



ప్రత్తిపాడు, జనవరి 28: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో గౌరీశంకర్ల 87వ వార్షికోత్సవ మహోత్సవంలో భాగంగా ఆదివారం రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు నిర్వహించారు. పేర్రాజు చెరువు సమీపంలోని పుష్కర కాలువ గట్టుపై ఈ పోటీలు నిర్వహించగా పోటీలను మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు జెండా ఊపి ప్రారంభించారు. సీనియర్స్ విభాగంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా గుమ్మలేరుకు చెందిన కోరా శృతి చౌదరి ఎడ్ల జతకు ప్రథమ బహుమతి లభించింది. కాకినాడ జిల్లా గొల్లప్రోలుకు చెందిన నిమ్మకాయల నూకరాజు ఎడ్ల జతకు ద్వితీయ స్థానం, తూర్పుగోదావరి జిల్లాలోని చెముడులంకకు చెందిన నాగిరెడ్డి నారాయుడుకు చెందిన ఎడ్ల జతకు తృతీయ బహుమతి లభించింది. జూనియర్స్ విభాగంలో కాకినాడ జిల్లా కొవ్వాడకు చెందిన మట్టా నవనీన్ శ్రీ మణికంఠ ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచింది. గొల్లప్రోలు మండలం వన్నెపూడికి చెందిన బదిరిశెట్టి మణి ఎడ్ల జత ద్వితీయ స్థానం, అనకాపల్లిజిల్లా చౌడవాడకు చెందిన గెడ్డం అప్పారావు ఎడ్ల జతకు తృతీయస్థానం లభించాయి. సీనియర్స్, జూనియర్స్ విభాగంలో మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, జడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంపీటీసీ జువ్వల సుజాతబాబులు బహుమతులు, షీల్డ్‌లు ప్రదానం చేశారు. ఈ పోటీలకు విశాఖ, అనకాపల్లి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణ, తెలంగాణాకు చెందిన 43 ఎడ్ల జతలు పోటీల్లో పాల్గొన్నారు. సీనియర్స్ విభాగంలో 7 ఎడ్ల జతలు, జూనియర్స్ విభాగంలో 36 ఎడ్ల జతలు ఈ పోటీల్లో తలపడ్డాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా ఉల్లాసంగా ఈ పోటీలు నిర్వహించడంతో పేర్రాజు చెరువు పుష్కర కాలువ గట్టు జనసంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ఎడ్ల జతలు రావడంతో ఎడ్లకు అవసరమైన తాళ్లు, కొరడాలు, ఇతర సామగ్రి అమ్మకం దుకాణాలు పోటీల ప్రదేశాల్లో వెలిశాయి. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా చేకూరి రామకృష్ణ, యనమల కృష్ణ, కంటే ఫణికుమార్ వ్యవహరించారు. విజేతలకు షీల్డ్ , నగదు బహుమతులు అందించారు. బహుమతుల దాతలుగా ముదునూరి మురళీకృష్ణంరాజు, బి.సుశీల అబ్బాయి, కిల్లాడి బాబ్జి, ఇంధన ఏసుబాబు బాబ్జి, పైలా ఏసుబాబు, చెక్కపల్లి రాంబాబు తదితరులు వ్యవహరించారు. పెద్దలు దాట్ల అప్పన్నబాబు, జువ్వల చినబాబు, కోలా తాతబాబు, బొల్లు సీతారామరాజు, జె.బాబులు, సానా నూకరాజు, దాడి చిన్నారావు, దొడ్డిపట్ల సోమన్నదొర తదితరులు తోడ్పాటు అందించారు.

500 ఏళ్ల తర్వాత రాముడు గెలిచాడు

- గుడికట్టేవాడిని గుండెల్లో పెట్టుకుందాం
- శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామీజీ
- రాజమహేంద్రవరంలో వైభవంగా హిందూ సంగమం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)/కల్చరల్, జనవరి 28: రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం ఆదివారం సాయంత్రం 'జై శ్రీరామ్.. భారత్ మాతాకీ జై.. వందేమాతరం' నినాదాలతో మార్మోగింది. కాషాయ జెండాలు కళకళలాడాయి. శ్రీరామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో భారీ హిందూ సంగమం అంగరరంగ వైభవంగా నిర్వహించారు. వందలాది మంది హాజరయ్యారు. శ్రీపీఠం పీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతి మాట్లాడుతూ 'భారతదేశ ఉనికి, అస్తిత్వం 2024 జనవరి 22న ప్రారంభమైందన్నారు. ఆ రోజున ప్రపంచమంతా భారతదేశ గొప్పతనం, ఆయోధ్య నగరి వైపు చూసిందని తెలిపారు. '524-25 మధ్యలో అయోధ్యలో రామమందిరాన్ని కూల్చేశారు. 500 ఏళ్ల తర్వాత సర్వోన్నత న్యాయస్థానంలో రాముడు గెలిచాడు. రామ మందిరాన్ని నిర్మించుకున్నాం. ప్రధాని మోదీ దేశంలోని ఉజ్జయిని అనే క్షేత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాడు. జ్యోతిర్లింగమైన కేదారినాథ్‌ని ఉద్ధరించి చూపించారు' అని తెలిపారు. శ్రీశైలం క్షేత్రానికి రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయబోతున్నట్లు చెప్పారు. గుడి కట్టేవాడిని గుండెల్లో పెట్టుకుందామా..గుడి కొట్టేవాడికి ఓటేద్దామా?..మన ఓటు గుడి కట్టేవాడికి మాత్రమే వేయాలని పిలుపునిచ్చారు. హిందూపురంలో కాషాయాన్ని ఎగురవేసి చూపిస్తామన్నారు. ఏప్రిల్‌లో మనం మన చూపుడు వేలుతో సిద్ధంగా ఉండాలి. బేషరతుగా జైశ్రీరాం అంటూ పోలింగ్ బూత్‌లలోకి వెళ్లి పువ్వు కనిపిస్తే ఓటేయాలి' అని పరిపూర్ణానంద పిలుపునిచ్చారు. హిందూ జాగరణ సమితి నాయకుడు అలే శ్యాం మాట్లాడుతూ హిందువులంతా సంఘటితంగా ఉంటే భారతదేశం బలమైన శక్తిగా విరాజిల్లుతుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు గడిచినా ఇంకా మనకు పూర్తి స్వాతంత్ర్యం రాలేదన్నారు. 'దేశంలో మత మార్పిడులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో దేశంలో ఎక్కడా లేనంతగా జరుగుతున్నాయని తెలిపారు. రాజమహేంద్రవరంలోని నందరం గనిరాజు జంక్షన్‌లో అతి త్వరలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఎంపీ భరత్‌రామ్ పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, శక్తి ప్రదర్శనలు, గీతాలాపనలు అలరించాయి. బీజేపీ నేతలు బొమ్ముల దత్తు, కురగంటి సతీశ్, శ్రీ రామ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వైష్ణవ దినేశ్, డాక్టర్ కర్రి రామారెడ్డి పాల్గొన్నారు.

సభకు హాజరైన హిందువులు



పరిహారం ఇవ్వకుంటే పోరాటమే

యానాం, జనవరి 28: యానాం నియోజకవర్గంలో మత్స్యకారులకు రావలసిన పరిహారంపై యానాం అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం దూకుడు పెంచింది. పుదుచ్చేరి ప్రభుత్వం ఇచ్చిన మత్స్యకారుల జాబితా ఆధారంగా ప్రభుత్వ ఖాతాలో నగదు జమ చేయకుంటే ఫిబ్రవరి రెండో తేదీన పరిశ్రమ వద్ద ఆందోళనకు సిద్ధమని సంఘం హెచ్చరించింది. మత్స్యకార నాయకుడు, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నేతృత్వంలో స్థానిక అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం మత్స్యకారుల సమావేశం జరిగింది. గత రెండు సంవత్సరాలుగా నష్టపరిహారం విషయంలో చేసిన విశేష కృషి ఫలితంగానే ఈ స్థితికి చేరుకున్నామని, ఇప్పుడు పరిశ్రమ నుంచి అడ్డంకులు వస్తున్నాయని వాటిని ఏవిధంగా అధిగమించాలనే అంశాలపై చర్చించారు. ఆంధ్రాలో ఇప్పటికే నాలుగు విడతలు పరిహారం ఇచ్చినప్పటికీ యానాంలో మాత్రం ఒక్క విడతే ఇస్తామని, దీనిపై అటు పరిశ్రమ, ఇటు ప్రభుత్వం కాలయాపన చేస్తోందని పలువురు మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ప్రధానంగా రెండు అంశాలపై కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈనెలాఖరునాటికి ఓఎన్‌జీసీ సంస్థ ప్రభుత్వ ఖాతాలో పరిహారం జమ చేయకుంటే ఫిబ్రవరి రెండో తేదీన యానాం-గిరియంపేట రోడ్డులోని ఓఎన్జీసీ పరిశ్రమ ఎదురుగా మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఆందోళనకు సిద్ధమన్నారు. తదుపరి గ్రామాల వారీగా ఆందోళనకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని నిర్ణయించారు. అదే విధంగా చమురు సంస్థ ప్రభుత్వ ఖాతాలో జమ చేస్తే ఫిబ్రవరి 15 నాటికి (పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ లోపు) లబ్ధిదారుల ఖాతాలో జమ చేయకుంటే మత్స్యకారులందరూ ఎన్నికలను బహిష్కరించనున్నామని తెలిపారు. ఏ పార్టీ అయినా తాము ఓటు వేయకుండా తమ నిరసనను తెలుపుతామన్నారు. ఇందుకు సంబంధించిన అంశాలపై యానాం అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం రాతపూర్వకంగా ఓఎన్జీసీ, పుదుచ్చేరి ప్రభుత్వ అధికారులకు ఇతర ప్రతినిధులకు ఇస్తామన్నారు. కార్యక్రమంలో యానాం అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శేరు కృష్ణ, మల్లాడి శామ్యూల్, చింతా వెంకటేశ్వర్లు, మల్లాడి విష్ణు, మల్లాడి రాజు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలు ఆక్సిజన్ ఫ్యాక్టరీలు



నర్సరీని పరిశీలిస్తున్న డాక్టర్ నాగేశ్వరరెడ్డి

కడియం, జనవరి 28: కడియం నర్సరీలు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించే ఫ్యాక్టరీలని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ(ఏఐజీ) ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి ప్రశంసించారు. కడియపులంక పుల్లా వీరవెంకట రావు-సత్యదేవా నర్సరీని ఆదివారం ఆయన సందర్శించారు. వారికి నర్సరీ రైతు వీరవెంకటరావు పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. నాగేశ్వరరెడ్డి నర్సరీల్లోని వివిధ రకాల మొక్కలను తిలకించారు. కడియం నర్సరీలను సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన వైద్య బృందంతో మరోసారి వచ్చి కడియం నర్సరీలను సందర్శిస్తామన్నారు. కార్యక్రమంలో పుల్లా సత్యనారాయణ (చంటియ్య), పుల్లా ఆంజనేయులు (అబ్బులు), పుల్లా రామారావు, పెద సత్యనారాయణ, వీర్రాజు, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ కస్తూరి సుబ్రహ్మణ్యం, పుల్లా శ్రీకాంత్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో గంజాయి రవాణా!



గంజాయి అంబులెన్స్ ఇదే..

మోతుగూడెం, జనవరి 28: గంజాయి అక్రమ రవాణా కొత్త పుంతలు తొక్కుతోంది. కొత్తగా అంబులెన్స్ మాదిరి వాహనాలను వినియోగిస్తున్నారు. అంబులెన్స్ అనుకుని పోలీసులు ఆపకుండా వదిలేస్తారని వారి తెలివితేటలు. అయితే పోలీసులు అలాంటి వారి ఆట సైతం కట్టిస్తున్నారు. మోతుగూడెం పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం అంబులెన్స్ మాదిరి గంజాయి రవాణా వాహనాన్ని పట్టుకున్నారు. 500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చింతూరు అడిషనల్ ఎస్పీ రాహుల్‌మీనా వివరాలు తెలిపారు. గంజాయిని మోతుగూడెం నుంచి రాజస్థాన్‌లోని జ్యోతిపూర్‌కు తరలిస్తున్నారన్నారు. ఒడిసాకు చెందిన రామారావును అదుపులోకి తీసుకున్నామన్నారు. రాజస్థాన్, ఒడిసాకు చెందిన మరో ఇద్దరు పరారీలో ఉన్నారని చెప్పారు. గంజాయి విలువ రూ.25 లక్షలు ఉంటుందన్నారు. మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు, ఏఎస్ఐలు టి.రాజేశ్వరరావు, సూర్యనారాయణ, నూకరాజు, హెడ్ కానిస్టేబుల్ యుఆర్‌కే రాజు రమేష్, మురళి, శ్రీనివాస్, పోలీసులు సన్ని, బషీర్ ఉన్నారు.

24 గంటల్లో దొంగ ఆట కట్టించారు



సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసులు

రాజమహేంద్రవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): బొమ్మూరు పోలీసులు 24 గంటల్లో దొంగ ఆట కట్టించారు. నెల్లూరు జిల్లాకు చెందిన వెల్లిబోయిన వినయ్ దైవ దర్శనానికి 26న పిఠాపురం వచ్చాడు. అక్కడ ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. ఇద్దరూ సాయంత్రానికి రాజమహేంద్రవరం వచ్చి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న మెట్రో లాడ్జిలో దిగారు. ఉదయం నిద్ర లేచి చూసే సరికి కెమెరా, ల్యాప్‌టాప్, ఆ వ్యక్తి కనిపించలేదు. దీంతో వినయ్ బొమ్మూరు పోలీసులను ఆశ్రయించాడు. సీఐ ఎండీ ఉమర్ ఆధ్వర్యంలో ఎస్ఐ జగన్ మోహన్ తన సిబ్బందితో రంగంలోకి దిగారు. సీసీ కెమెరాలు ఆధారంగా కాకినాడకు చెందిన పిల్లారిశెట్టి శ్రీనివాస్‌ని నిందితుడిగా గుర్తించి ఆదివారం అరెస్టు చేశారు. సుమారు రూ.1.20లక్షల విలువ చేసే చోరీసొత్తును స్వాధీనం చేసుకున్నారు. కేసు పరిష్కారంలో ప్రతిభ చూపిన సీఐ ఉమర్, ఎస్ఐ జగన్, ఏఎస్ఐ ఏకే సత్యనారాయణ, పీసీ సురేశ్‌ని ఎస్పీ జగదీశ్ అభినందించారు.

కిరాణా, ఎలక్ట్రికల్ షాపులో అగ్నిప్రమాదం

రూ. 10 లక్షల ఆస్తి నష్టం



దగ్ధమైన కిరాణా సరుకులు

అంబాజీపేట, జనవరి 28: అంబాజీపేట బస్టాండ్‌కు వెళ్లేదారి బీఎస్ ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో ఓ కిరాణా, ఎలక్ట్రికల్ షాపులో శనివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ ప్రమాదంలో రూ. 10 లక్షలు విలువైన కిరాణా సరుకులు, ఎలక్ట్రికల్ సామాన్లు అగ్నికి ఆహుతయ్యాయి. అంబాజీపేటకు చెందిన సత్తి త్రిమూర్తులు ఇటీవల గణపతి ఎలక్ట్రికల్ అండ్ కిరాణా స్టోర్స్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. శనివారం అర్ధరాత్రి షాపులో వెనుక భాగంలో ఉన్న ఇన్వేటర్ ద్వారా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి అక్కడ ఉన్న నూనె ప్యాకెట్లకు మంటలు వ్యాపించాయి. దీంతో ఈ మంటలు షాపంతా వ్యాపించగా షాపులో నూనె, కిరాణా సామగ్రి, ఎలక్ట్రికల్ సామన్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో రూ.10లక్షలకు పైగా నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. సంఘటన స్థలాన్ని అమలాపురం అగ్నిమాపక అధికారులు, రెవెన్యూ, పోలీసు అధికారులు, అమలాపురం చాంబర్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, సుంకర బాలాజీ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, అంబాజీపేట కిరాణా సంఘం అధ్యక్షుడు కాసు రాజా పండు తదితరులు పరిశీలించారు.

పంపా నది ఒడ్డున మృతదేహం

తుని రూరల్, జనవరి 28: కాకినాడ జిల్లా అన్నవరంలో పంపానది ఒడ్డున గుర్తుతెలియని మృతదేహం కలకలం రేపింది. సుమారు 25 ఏళ్ల వయస్సు ఉన్న యువకుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. సంబంధీకులు అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలి

ఏపీ ఆర్యవైశ్య మహాసభలో వక్తలు పిలుపు



మాట్లాడుతున్న శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 28: ఆర్యవైశ్యులు రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం చెరుకూరి కల్యాణ మండపంలో ఏపీఐఐసీ మాజీ ఛైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఏపీ ఆర్యవైశ్య మహాసభ సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మనం కూడా మారాలన్నారు. ప్రస్తుతం పరిస్థితులు మారిన దృష్ట్యా రాజ్యాధికారం సాధించాలన్నారు. ఆర్యవైశ్య మహాసభకు రాజకీయ రంగు పులమలేదన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు రాయలసీమ, ఆంధ్ర, ఉత్తరాంధ్ర మూడు ప్రాంతాల ఎన్నికలు ప్రక్రియను వివరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రత్నాజీ మాట్లాడుతూ పెద్దలు కొణిజేటి రోశయ్య ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహాసభ ఒక్కతాటిపై నడిచిందన్నారు. కానీ ఇప్పుడు రెండు వర్గాలుగా విడిపోవడం సరికాదన్నారు. శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు గుప్తా మాట్లాడుతూ ఆర్యవైశ్యులంతా సంఘటితంగా ఉండాలన్నారు. గుబ్బా చంద్రశేఖర్ మాట్లాడుతూ మార్చిలో జనరల్ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ద్వారకానాథ్ నెల ముందే మహాసభ ఎన్నికలు జరుపుతున్నారని చెప్పారు. శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభ రాజకీయ లక్ష్యం కోసం పెట్టిందికాదన్నారు. కుసుమంచి సుబ్బరాయులును మహాసభ నూతన అధ్యక్షుడిగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకున్నట్లు చెప్పారు. మహాసభలో విశాఖ అర్బన్ అధ్యక్షుడు అమర్, రూరల్ అధ్యక్షుడు సత్యనారాయణ, కాకినాడ అర్బన్ అధ్యక్షుడు బాదం మధు, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు రంగప్రసాద్, ఏలూరు అర్బన్ అధ్యక్షుడు చక్కా రాజా, బ్రాహ్మయ్య, గుంటూరు అర్బన్ అధ్యక్షుడు ఆత్మకూరి నగేష్, నెల్లూరు అర్బన్ అధ్యక్షురాలు జ్యోతి, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఆండాల్, సీతాలక్ష్మి, నేతలు హరనాథ్, శరత్ పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

•అమలాపురం • పి.గన్నవరం • రాజోలు • ముమ్మిడివరం • కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

అన్నప్రసాద భవన నిర్మాణానికి రూ.1,11,111 విరాళం

ఆత్రేయపురం, జనవరి 28: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,54,333 లభించినట్టు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి సీతానగరం మండలం చినకొండేపూడికి చెందిన కర్రలపూడి గంగన్న రూ.1,11,111 విరాళం సమర్పించారు. దాతకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

ఎస్టీయూ పట్టణశాఖ నూతన కార్యవర్గం ఎంపిక



ఎస్టీయూ పట్టణశాఖ కార్యవర్గంతో ప్రమాణ ం చేయిస్తున్న ఎంఎస్ఎస్ మూర్తి

అమలాపురం టౌన్, జనవరి 28: రాష్ట్రోపాధ్యాయ సంఘం అమలాపురం పట్టణశాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మద్దాలవారిపేటలో జరిగిన సర్వసభ్య సమావేశంలో గౌరవాధ్యక్షుడిగా కొల్లు సత్యనారాయణ, అధ్యక్షుడిగా నక్కా బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా బొరసు రమాకాంత్, ఆర్థిక కార్యదర్శిగా పట్నాల రవికుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎంఎస్ఎన్ ప్రసాద్, మహిళా అధ్యక్షురాలిగా రొక్కాల దుర్గ, అభయ్ కన్వీనర్‌గా సుదర్శనరాజు, జిల్లా కౌన్సిలర్లుగా ఎంఎస్ఎన్ మూర్తి, సరాగుల గోపీరాజు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయించారు. ఓపీఎస్ అమలు చేయాలని తీర్మానించారు. జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ, నాయకులు నల్లి ప్రసాద్, సరిదే సత్య పల్లంరాజు, చిక్కం మైనరుబాబు, ఫ్యాప్టో జిల్లా చైర్మన్, నాగిరెడ్డి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం మండల కార్యవర్గం ఎన్నిక

అల్లవరం: అల్లవరంలోని అభ్యుదయ పాఠశాలలో ఎస్టీయూ మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా నంద్యాల వెంకటపద్మగురునాయుడు, ప్రధాన కార్యదర్శిగా కొనుకు రత్నంరాజు, ఆర్థిక కార్యదర్శిగా చెన్నంశెట్టి శ్రీరంగరాజేష్ ఎంపికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా కోట బాలకృష్ణ, కడలి నాగగణేష్, యాళ్ల జ్యోతికుమార్, గుత్తాల వెంకటేశ్వరరావు, కోరుమిల్లి ప్రభాకర రవిశ్వనాథ్, కుసుమ రమేష్, ఆర్వీ సత్యనారాయణ, మూల దివాకర శ్రీనివాస్, బొంతు శిరీషకుమారి ఎన్నికయ్యారు. వీరిని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి అభినందించారు.

ఐడీఏ జిల్లా శాఖ నూతన కార్యవర్గం

అమలాపురం రూరల్, జనవరి 28: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ జిల్లా శాఖ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారాన్ని ఇందుపల్లిలోని ఎ1 కన్వెన్షన్ హాలులో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ వీఎస్ఎస్ఎన్ మూర్తి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ బీహెచ్‌వీ రామకృష్ణంరాజు, డాక్టర్ డి.సత్యసునీల్,కోశాధికారిగా డాక్టర్ జి.గణాధిపతిలతో ప్రమాణం చేయించారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్‌బీఎస్‌వీఎన్ ప్రసాద్, డాక్టర్ జి.సజన్‌ఆనంద్, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ ఎస్.మురళీకృష్ణంరాజు, అదనపు కార్యదర్శి డాక్టర్ జీఎస్ దీపక్‌తోపాటు జి.శృతి, వి.అమృతవల్లి, ఎస్.పావని ప్రమాణం చేశారు.

బాలబాలాజీని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

మామిడికుదురు, జనవరి 28: అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండీఘర్ రాష్ట్ర జ్యుడీషియల్ మెంబర్, న్యూఢిల్లీకి చెందిన వీఎస్ఎన్ ప్రసాద్ బాలబాలాజీ దర్శనార్థం రాగా వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహింపచేసి వేదాశీర్వచనం ఇచ్చారు. అలాగే చీఫ్ అడ్మినిస్ట్రేషన్ పోలీసు ఆఫీసర్ సి.గోవిందరాజన్ ఆదివారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం వారికి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఏసీ జి.మాధవిలు స్వామివారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదం ఇచ్చి సత్కరించారు.



చండీఘర్ జ్యుడీషియల్ మెంబర్‌కు వేదాశీర్వచనం ఇస్తున్న అర్చకులు

లంకగ్రామాల సమస్యలపై ఏపీ ప్రభుత్వానికి లేఖ రాస్తా

● కేంద్ర సహాయ మంత్రి అబ్బయ్య నారాయణస్వామి

పి.గన్నవరం, జనవరి 28: పశ్చిమగోదావరి జిల్లా లంక గ్రామాల సమస్యలపై ఏపీ ప్రభుత్వానికి లేఖ రాస్తానని కేంద్ర సామాజిక న్యాయ సహాయ మంత్రి అబ్బయ్య నారాయణస్వామి తెలిపారు. పి.గన్నవరంలో జరిగిన హాలో మాదిగ..ఛలో గన్నవరం కార్యక్రమానికి హాజరుకావడానికి వస్తున్న కేంద్ర మంత్రిని వైపీ పాలెం వంతెన వద్ద లంకగ్రామాల ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంతెనకు సంబంధించిన ప్రతిపాదన వివరాలను పూర్తిస్థాయిలో తయారుచేసి సోమవారం ఉదయానికి అం దించాలన్నారు. శంఖుస్థాపన చేసి పనులు ఎందుకు చేపట్టలేదని పాలకొల్లు సబ్‌డివిజన్ పంచాయతీరాజ్ ప్రాజెక్టు జే ఈ వై.మెహర్‌బాబాను అడిగారు. ప్రభుత్వం మారిన తరువాత టెండర్లు రద్దయ్యాయని బదులిచ్చారు. మంత్రి వెంట ఆర్డీవో ఎం.ముక్కంటి, తహసీల్దార్ జీఆర్ ఠాగూర్, సిఐ ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ హరికోటిశాస్త్రీ, ఆకుమర్తి చిన్నామాదిగ, పాపారావు, సిర్రా శ్రీను, సిర్రా చిట్టిబాబు, సిర్రా శ్రీను తదితరులు ఉన్నారు.

సమాజం కోసం పోరాడితేనే గుర్తింపు

సమాజంకోసం పోరాడితే ఏ రాజకీయపార్టీ అయినా గుర్తిస్తోందని కృషిలేకుండా నాయకులు కాలేరని కేంద్ర సామాజిక న్యాయ సహాయ మంత్రి అబ్బయ్య నారాయణస్వామి అన్నారు. మాదిగల శక్తి ప్రదర్శన చేసి రాజకీయ పార్టీలను బిఫామ్‌లు అడగాలన్నారు. పి.గన్నవరంలో జరిగిన మాదిగల రాజకీయ జేఏసీ మహాసభకు ఆకుమర్తి చిన్నామాదిగ అధ్యక్షత వహించగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మాదిగల వర్గీకరణ ఇవ్వాలని ఏడు కమిషన్లు రిపోర్టు ఇస్తే కనీసం ఆయా రాష్ట్రాల సీఎంలుగాని, ఎమ్మెల్యేలుగాని, ఎంపీలుగాని అసెంబ్లీలు, పార్లమెంట్‌లో మాట్లాడలేదని దుయ్యబట్టారు. ప్రధాని మోదీ, అమిత్‌షా కూడా వర్గీకరణపై సానుకూలంగా ఉన్నారన్నారు. వర్గీకరణ విషయంలో ఏపీ ప్రభుత్వం సానుకూలంగాలేదన్నారు. అలాగే పలువురు నాయకులు మాట్లాడుతూ కోనసీమలో ఒక ఎమ్మెల్యే, ఎంపీ సీటు మాదిగలకు కేటాయించాలని, భవిష్యత్తులో ఏరాజకీయ పార్టీ అయితే మాదిగలకు ప్రాధాన్యం కల్పిస్తుందో ఆ పార్టీకే మాదిగల మద్దతు ఉంటుందని, బాబుజగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. నారాయణస్వామికి ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించగా ఆయన ఆకుమర్తి ఫౌండేషన్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆకుమర్తి ఆశీర్వాదం, చుట్టగుళ్ల నీలకంఠం, కొల్లి సూర్యరావు, ఆకుమర్తి శ్రీను, మడికి శ్రీరాములు, వై.ఝాన్సి, దిగుమర్తి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాదిగల రాజకీయ జేఏసీ మహాసభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి నారాయణస్వామి

'జగన్ ప్రభుత్వాన్ని గద్దెదింపడమే ప్రజల అజెండా'



రావులపాలెంలో పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, జనవరి 28: ఆరాచక పాలన సాగిస్తున్న జగన్ ప్రభుత్వాన్ని గద్దెదించడమే ప్రజలు అజెండాగా భావిస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వెదిరేశ్వరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ పాలన ముగింపునకు సమయం ఆసన్నమైందన్నారు. 74 రోజుల్లో ఆ పార్టీ కనుమరుగవ్వడం ఖాయమన్నారు. వైసీపీ సాగిస్తున్న అరాచకాలు, దురాగతాలకు తీర్పు ఇవ్వడానికి ప్రజాకోర్టు సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు సయ్యపు రాజు రామకృష్ణంరాజు, సరిపెల్ల వెంకట శ్రీనివాసరాజు, సయ్యపు రాజు నరసింహరాజు, సాధనాల శ్రీను పాల్గొన్నారు.

టీడీపీకి పెరుగుతున్న ఆదరణ

రావులపాలేనికి చెందిన మాజీ ఎంపీటీసీ కొండేపూడి రామకృష్ణ వైసీపీకి రాజీనామా చేసి రెండు రోజుల క్రితం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం ఆయన అనుచరులు పలువురు టీడీపీలో చేరారు. వారికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, యువ నాయకుడు బండారు సంజీవ్, కోనాల అంబేడ్కర్, మాసాబత్తుల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజామోదం కలిగిన నాయకుడికే రాజోలు సీటు

● మాజీమంత్రి గొల్లపల్లి

మలికిపురం, జనవరి 28: ప్రజా ఆమోదం కలిగిన నాయకుడికే రాజోలు అసెంబ్లీ స్థానానికి తెలుగుదేశం-జనసేన ఉమ్మడి అభ్యర్థిని ప్రకటిస్తారని మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. కొల్లాబత్తుల కుమార్ ఇంటి వద్ద మలికిపురంలో అడబాల యుగంధర్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు, పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీమంత్రి గొల్లపల్లి మాట్లాడుతూ 43 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కలిగిన చంద్రబాబు నిస్వార్థపరుడు, నిబద్ధత, నిజాయితీ కలిగి ప్రజాసేవే పరమావధిగా భావించే పవన్‌కల్యాణ్‌ల కలయికతో రాష్ట్రంలో మరో మూడున్నర నెలల్లో అద్భుతమైన పరిపాలన రాబోతుందని అన్నారు. కార్యక్రమంలో గొల్లపల్లి తనయుడు గొల్లపల్లి శ్రీధర్, ఎంపీపీ కేతా శ్రీను, మంగెన భూదేవి, చెల్లింగి సత్యనారాయణ, కాండ్రేగుల సత్యనారాయణ, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, రాపాక నవరత్నం, చాగంటి స్వామి, బందెల పద్మ పాల్గొన్నారు.



రామచంద్రపురం: సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

ఎన్నికలకు సంసిద్ధంగా ఉండండి

● పార్టీ శ్రేణులకు రెడ్డి సుబ్రహ్మణ్యం దిశా నిర్దేశం

రామచంద్రపురం, జనవరి 28: ఎన్నికలు ఎంతో దూరం లేవని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల యుద్ధం ఎప్పుడు వచ్చినా ఎదుర్కోవడానికి ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు సంసిద్ధంగా ఉండాలని ఆదేశించారు. రామ చంద్రపురం పట్టణం క్లస్టర్-1 ఇంటిగ్రేటెడ్ శిక్షణా సమా వేశం శీలం వారి సావరంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ మేడిశెట్టి సూర్యనారాయణ ఇంటివద్ద, కమ్మవారి సావరంలో క్లస్టర్-2 ఇన్‌చార్జ్ అక్కల రిష్వంత్‌రాయ్ నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.ఎస్. మాట్లాడుతూ ఇంతవరకూ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం ఎక్కడెక్కడ జరిగిందీ, జనాభా ప్రాతిపదికన ఇంకా ఎక్కడెక్కడ జరగాలన్న వివరాలు సేకరించారు. అలాగే తుది ఓటరు జాబితా విడుదలైన నేపథ్యంలో అప్రమత్తంగా వుండాలని అన్నారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు కడియాల రాఘవన్, మేడిశెట్టి శేషారావు, గుణ్ణం వినోద్, అక్కల రాగూర్, జాస్తి విజయలక్ష్మి,వెలుగుబంట్ల లక్ష్మణ్, రాజేశ్వరి, బళ్ల లక్ష్మి, కొసనా శ్రీనివాసరావు, ఖండవిల్లి విజయవీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో టీడీపీ గెలవాలి

ద్రాక్షారామ: రామచంద్రపురం నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలిచి తీరాలని నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. అందుకుగాను వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నియోజకవర్గ రెడ్డి సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. ఆదివరం రామచంద్రపురం మండలం వేగాయమ్మపేట, అంబికపల్లి అగ్రహారం గ్రామాల్లో జరిగిన క్లస్టర్, 3,4 సమావేశాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. క్లస్టర్ ఇన్‌చార్జులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

మండపేట, జనవరి 28: మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. మండలంలోని చినద్వారపూడికి చెందిన గ్రామ వలంటీర్‌తోసహా, పలువురు గ్రామానికి చెందిన టీడీపీ నేత చింతపల్లిరామకృష్ణ సారథ్యంలో ఆదివారం టీడీపీలో చేరారు. వారిలో గ్రామవలంటీర్ చింతపల్లి గణేష్, పిఏసీ మాజీచైర్మన్ నీలదుర్గారావు, సూరంపూడి మణికంఠ తదితరులు ఉన్నారు. అలాగే రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన గుత్తుల శ్రీనివాసరావు, నేతృత్వంలో అనసూరి గణేశ్వరరావు, మేడిశెట్టివెంకట్రావు, బేవన వెంకన్న, పందిరి వీరబాబు,తాడి నాగరాజు తదితరులు పార్టీలో చేరారు. చేరినవారికి పార్టీకండువాలను కప్పి వేగుళ్ల పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో అమలాపురం పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు వై.ఆర్.కే పరమహంస, రావుల సత్యన్నారాయణ, శాఖశ్రీనివాసరావు, గుత్తుల శ్రీను, కర్రివెంటకటరెడ్డి, కాళ్లమణిప్రసాద్, నల్లివెంకటరమణ, పిల్లి వెంకటరమణ, కురుపూడి ఉమ,మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ సూరంపూడిగనిరాజు, గుడాల వీరవెంకటరమణ, చింతపల్లి కృష్ణ, పలివెల పనసయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వేగుళ్ల నేతృత్వంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

ద్వారపూడిలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ

మండలంలోని ద్వారపూడి పంచాయతీ పరిధిలోగల చిన ద్వారపూడిలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంను నిర్వహించారు. ఎమ్మెల్యే వేగుళ్ల కార్యక్రమంలో మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టించారన్నారు. వేగుళ్ల గ్రామంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టీడీపీ శ్రేణులు, నల్లమిల్లి వీర్రెడ్డి, యరగతపు బాబ్జి, ఎంఏసీ మజీ చైర్మన్ సూరంపూడి గనిరాజు, గోవిందు, చింత పల్లికృష్ణ, కోడే రామవేంద్రరావు, కోట గంగాదర్ పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి: నెక్కంటి

కపిలేశ్వరపురం, జనవరి 28 : టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశానని విజయనగరం జోనల్ ఆర్టీసీ మాజీ చైర్మన్, మాజీ ఎంపీపీ నెక్కంటి బాలకృష్ణ అన్నారు. మండలంలోని వెదురుమూడిలో ఆదివా రం తన అనుచరులతో కలిసి నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను టీడీపీ నాయకుడిగా ఎన్టీరామారావు పార్టీ స్థాపించినప్పటి నుంచి నేటివరకూ ఆపార్టీ చేసిన సేవలను గురించి వివరించారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయమే శిరోధారంగా పార్టీ విజయానికి కృషి చేస్తానని బాలకృష్ణ తెలిపారు. సమావేశంలో పి.శేషగిరిరావు, సుంకరకృష్ణ, జి.వెంకటరమణ, ఎస్వీ పట్టాభిరామారావు, పి.వెంకట్రావు, జి. సత్యనారాయణ పాల్గొన్నారు.

డాక్టర్ సంధ్యారత్నకు 'వైద్య నారీరత్న' అవార్డు

అమలాపురంటౌన్, జనవరి 28: ప్రకృతి వైద్యురాలిగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ ముషిణి సంధ్యారేఖకు రాయుడు కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'వైద్య నారీరత్న' అవార్డు అందించి సత్కరించారు. ఆదివారం సూర్యనగర్‌లో జరిగిన కార్యక్రమంలో సంధ్యారాణి సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో యూత్ జేఏసీ నాయకుడు కరాటం ప్రవీణ్, నీలి సంసోను, మైత్రిపాటి రామం, ఎంవీఎల్ నరసింహమూర్తి, ముషిణి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర క్రికెట్ పోటీలకు కీర్తన



ఉప్పలగుప్తం, జనవరి 28: క్రికెట్ రాష్ట్రస్థాయి పోటీలకు అండర్-17 మహిళల విభాగంలో గొల్లవిల్లి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని తిక్కిరెడ్డి కృపాకీర్తన ఎంపికైనట్టు పీడీ గొలకోటి ఫణీంద్రకుమార్ తెలిపారు. ఈ నెల 29 నుంచి 31 వరకు నరసారావుపేటలో జరిగే పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు తరపున కీర్తన పాల్గొంటుందన్నారు. విద్యార్థిని హెచ్ఎం లంక రాణి, పీఎంసీ చైర్మన్ దోనిపాటి రమావెంకటరమణ, ఉపాధ్యాయినీఉపాధ్యాయులు అభినందించారు.

రాజశేఖర్‌రెడ్డికి వారసురాలు షర్మిలనే

● జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కామన

మండపేట, జనవరి28: కాంగ్రెస్‌పార్టీ అంటే విధేయత అంకితభావం కలిగిన నిజమైన కాంగ్రెస్‌వాది, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అన్నారు. మండపేట పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి రెండుసార్లు పీసీసీ అధ్యక్షుడిగా, రెండుసార్లు సీఎంగా పని చేశారన్నారు. రాజశేఖర్‌రెడ్డి నిజమైన వారసురాలు షర్మిలమాత్రమేనని కామన అన్నారు.

మల్లాడిని కలిసిన ఆర్.నారాయణమూర్తి



మల్లాడితో మాట్లాడుతున్న ఆర్ నారాయణమూర్తి

యానాం, జనవరి 28: ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావును కలిశారు. ఆదివారం యానాం వచ్చిన నారాయణమూర్తి మల్లాడిని మర్యాద పూర్వకంగా కలిసి ముచ్చటించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించుకున్నారు.

పుట్టినరోజు నాడే శరీర దానం



యలమర్తి రాధాకృష్ణ

అమలాపురంటౌన్, జనవరి 28: పుట్టినరోజు, పెళ్లిరోజు జరిగితే దాన ధర్మాలు చేయడం సహజం. కానీ పుట్టిన రోజు నాడే తన శరీరాన్ని దానం చేశాడు అమలాపురం పట్టణానికి చెందిన బులియన్ వ్యాపారి యలమర్తి రాధాకృష్ణ. పుట్టినరోజు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణంపోయిన తర్వాత కూడా జీవించడం ఎలాగో తెలుసా అంటూ తన శరీరాన్ని అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలకు దానం చేశారు. శరీర దానం చేయాలనే కోరిక ఎన్నో ఏళ్లగా తనకు ఉందని, ఇన్నాళ్లకు శరీర దానానికి అంగీకరిస్తూ విల్లు రిజిస్టర్ చేశానని, సంబంధిత పత్రాలను చూపించారు. రాధాకృష్ణను బులియన్ అసోసియేషన్ ప్రతినిధులు బోనం సత్యవరప్రసాద్, గోకరకొండ హరిబాబు తదితరులు అభినందించారు.

ఆరోగ్యవంతమైన జీవనానికి యోగాసనాలు మేలు

అమలాపురం టౌన్, జనవరి 28: ఆరోగ్యవంతమైన జీవనానికి యోగాసనాలు ఎంతో మేలు చేస్తాయని స్వామీవివేకానంద యోగాశ్రమం వ్యవస్థాపకుడు ఆకుల శ్రీనివాస్ పేర్కొన్నారు. యోగాసనాల ద్వారా ఆరోగ్యంతోపాటు విజ్ఞానార్జనకు ఎంతో దోహదపడుతుందన్నారు. కామాక్షీ పీఠంలో పీఠాధిపతి కామేశమహర్షి ఆధ్వర్యంలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు ఆదివారం యోగాసనాలను నేర్పించారు.

ఘనంగా ఇమామ్ అలీ గంధోత్సవం

అమలాపురం టౌన్, జనవరి 28: షియా ముస్లింల ఆరాధ్య దైవమైన మహ్మద్ ప్రవక్త తమ్ముడైన ఇమామ్ అలీ పుట్టినరోజును పురస్కరించుకుని షియాలు అమలాపురంలో ర్యాలీ నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన షియా ముస్లింలు ముజాఫర్ సందులోని ఆస్తానేఅబ్బాస్‌ఏపంజాకు చేరుకున్నారు. అక్కడినుంచి ర్యాలీగా ముస్లిం వీధి ఖ్వాజాబాబా దర్గా, ముమ్మిడివరం గేటు మీదుగా అలీకరీముల్లాషా దర్గాకు భక్తి గీతాలు పాడుతూ చేరుకున్నారు. నారేహైదరి నినదిస్తూ గంధోత్సవాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ప్రపంచశాంతి కోసం ప్రార్థించారు. ధర్మకర్త మహ్మద్ మిస్సార్ హుస్సేన్, కార్యదర్శి కర్రార్‌హుస్సేన్ ఆధ్వర్యంలో గంధోత్సవం నిర్వహించారు.

ఆనందోత్సాహాల మధ్య హజరత్‌అలీ గంధోత్సవం

మామిడికుదురు, జనవరి 28: ముస్లిం మతస్తుల ఆరాధ్య దైవం, ప్రథమ ప్రవక్త ఇమామ్ హజరత్ అలీ గంధోత్సవాన్ని ముస్లిం భక్తులు ఆనందోత్సాహాల మధ్య ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మామిడికుదురులోని కమైబనీహాసిం పంజా నుంచి గంధాన్ని తీసుకుని నగరంలోని పెదపంజీష వరకు ఊ రేగింపుగా తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో కార్యక్రమంలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

యానాం, జనవరి 28: యానాం నియోజవర్గంలోని జామియా మసీదు నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఎస్‌కెఎం జిలానీ, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ కరీ, కార్యదర్శిగా రిజ్వాన్, సంయుక్త కార్యదర్శిగా మహమ్మద్ గౌస్ మొహిద్దీన్, కోశాధికారిగా జిలానీ ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గం సభ్యులు పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

పలు కుటుంబాలకు జనసేన అభిమాని సాయం

అంబాజీపేట, జనవరి 28: ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు జనసేన అభిమాని గిడ్డి సత్యనారాయణ ఆర్థిక సాయం అందిం చారు. ఇరుసుమండ, మాచవరం, ముసలపల్లి గ్రామాల్లో ఐదు కుటుంబాలకు రూ.55 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, అరిగెల సూరిబాబు, అక్కిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, పితాని వెంకటేశ్వరరావు, అక్కిశెట్టి రమేష్, దొమ్మేటి సాయికృష్ణ, రంకిరెడ్డి వెంకటేశ్వరరావు, సుంకర గణపతిరావు, ఆకుల బాబ్జి, మామిడిశెట్టి రమణ, చిన్నం బాలవిజయరావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: 105
వెంకటరమణ	: డెవిల్
శ్రీలలిత	: కెప్టెన్ మిల్లర్
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: నాసామిరంగ
రమా	: గుంటూరు కారం
గణపతి	: సైంధవ్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: హనుమాన్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: సలార్

మాజీ సర్పంచ్ భర్త మృతి

ఉప్పలగుప్తం, జనవరి 28: మండలంలోని వానపల్లిపాలెం మాజీ సర్పంచ్ నల్లా సూర్యారత్నం భర్త, టీడీపీ సీనియర్ నాయకుడు నరసింహారావు మృతి చెందారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రత్నాన్ని సర్పంచ్ నల్లా బాబండి, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ పరామర్శించారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి

బ్రాహ్మణ పురోహిత క్రికెట్ పోటీలు



సుబ్రహ్మణ్యశర్మకు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అందజేస్తున్న నిర్వాహకులు

అమలాపురం టౌన్, జనవరి 28: అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ పురోహిత క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా జరుగుతోంది. రెండో దశ పోటీల్లో భాగంగా ఆదివారం విజేతల వివరాలను నిర్వాహకులు కర్రా బాబి, ఉపద్రష్ట విజయ్ ప్రకటించారు. కాకినాడ రుద్రాస్-విజయనగరం జట్లు తలపడగా కాకినాడ జట్టు విజయం సాధించింది. రాజమహేంద్రవరం హుకుంపేట-గుంటూరు పవన్ జట్లు తలపడగా హుకుంపేట జట్టు విజయం సాధించింది. అంబాజీపేట-నర్సీపట్నం జట్ల మధ్య మ్యాచ్‌లో అంబాజీపేట జట్టు విజేతగా నిలిచింది. రాజోలు-నూజివీడు జట్ల మధ్య పోరులో నూజివీడు జట్టు గెలిచింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సుబ్రహ్మణ్య శర్మకు అందజేశారు. ఈనెల 30వ తేదీ వరకు సెమీఫైనల్స్ జరుగుతాయని, ఫిబ్రవరి 2న ఫైనల్ నిర్వహిస్తామని తెలిపారు. నిర్వాహకులు గండికోట సాయి, ఉపద్రష్ట మహేంద్ర, పోచినపెద్ది అక్షయ్ ఆధ్వర్యంలో పోటీలు జరుగుతున్నాయి. విజేత జట్టుకు రూ.50వేలు నగదుతో పాటు ట్రోఫీ, రన్నర్ జట్టుకు రూ.30 వేలు నగదుతో పాటు ట్రోఫీ అందజేస్తామన్నారు. సెమీస్ విజేతలకు రూ.10వేలు చొప్పున, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బౌలర్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కింద ఒక్కొక్కరికీ రూ.5వేలు చొప్పున బహుమతులు అందజేస్తామని చెప్పారు.

దివ్యాంగులకు వైద్య పరీక్షలు



వైద్యశిబిరంలో వినికిడి యంత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయవరం, జనవరి 28: మండలంలోని లొల్ల విశ్వమానవతా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వినికిడిలోపం ఉన్నవారికి, దివ్యాంగులకు వైద్యశిబిరం నిర్వహించారు. విశ్వమానవతా సంస్థ వ్యవస్థాపకుడు అల్లూరి శ్రీనివాసచౌదరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాకినాడకు చెందిన ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో వైద్య బృందం పాల్గొని వినికిడి లోపం ఉన్న 48మందికి పరీక్షలు నిర్వహించి 24 మందికి వినికిడి యంత్రాలు పంపిణీ చేయడంతోపాటు వినికిడి లోపం ఉన్న నలుగురు వ్యక్తులకు మెరుగైన వైద్యపరీక్షల నిమిత్తం కాకినాడ తరలించారు. దివ్యాంగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఇరువురికి ట్రైసైకిళ్లు, ఇరువురికి కృత్రిమ కాళ్లు మరమ్మతులుచేసి అందజేయడంతోపాటు ఆరుగురు దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేస్తున్నట్లు శ్రీనివాసచౌదరి తెలిపారు. ఈకార్యక్రమంలో డాక్టర్ రఘునాథ్, ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ అధినేత ఎస్వీరెడ్డి, డాక్టర్ న తీష్, జైకృష్ణ, టెక్నీషియన్ వెంకట్రావు, మానవతాసంస్థ ప్రతినిధులు, హోమియో వైద్యులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

రావులపాలెం, జనవరి 28: మండలంలోని వెదిరేశ్వరంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. గోపాలపురంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు.

వసతిగృహాలకు టీవీలు బహూకరణ



ఎస్సీ వసతిగృహంలో టీవీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం టౌన్, జనవరి 28: చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్సీ, బీసీ వసతిగృహాలకు ఎముకల ఆసుపత్రి వైద్య నిపుణుడు డాక్టర్ రాజా సౌజన్యంతో 55 అంగుళాల టీవీలను అందించారు. వాటిని కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, కార్యదర్శి యెండూరి నాగేశ్వరరావు, డాక్టర్ రాజా, మున్సిపల్ కమిషనరు వి.అయ్యప్పనాయుడు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలలో గుమ్మిలేరుకు ప్రథమస్థానం



ఆలమూరు, జనవరి 28: రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీల్లో గుమ్మిలేరు రైతు కోరా వీరభద్రరావు మరోసారి ప్రథమ స్థానంలో నిలిచారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగుల పోటీల్లో వీరభద్రరావు ఎడ్ల జత సీనియర్ విభాగంలో విజేతగా నిలిచింది. ఆయన్ను పలువురు అభినందించారు.

ఆలయ నిర్మాణ దాతకు సత్కారం

ఆలమూరు, జనవరి 28: ఆలమూరు ఎర్ర కాలనీలో సత్తెమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రూ.30వేలు విరాళమందించిన ప్రముఖ పారిశ్రామికవేత్త వైట్ల దుర్గారావు దంపతులను ఆదివారం ఘనంగా సత్కరించారు. వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవానీ దంపతులు రూ.10వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో నాయకులు చల్లా ప్రభాకరరావు, ఎలుగుబంటి బూరయ్య, అనుసూరి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఎన్ఆర్ఐ ఆర్థిక చేయూత

పి.గన్నవరం, జనవరి 28: ఇంజనీరింగ్ చదువుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న చుట్టుగుళ్ల భానుశ్రీ విషయమై స్థానిక టీడీపీ నాయకులు టీడీపీ ఎన్ఆర్ఐ తాళ్ళూరి శ్రీకాంత్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన ఆ విద్యార్థినికి రూ.26,250 ఏర్పాటు చేశారు. ఈమొత్తాన్ని వాడ్రేవుపల్లి అన్న క్యాంటీన్ వద్ద సర్పంచ్ పత్తిపాటి ఉమామహేశ్వరి, టీడీపీ నాయకులు భానుశ్రీకి అందించారు. కార్యక్రమంలో దాసరి వీరవెంకటసత్యనారాయణ, పెదపూడి శ్రీను, మందపాటి అనిత, గుడాల పణి, పెచ్చెట్టి వీరవెంకటసత్యనారాయణ, దొమ్మేటి వెంకటేశ్వరరావు, పత్తిపాటి వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యోదయ చారిటబుల్ ట్రస్టుకి మోడరన్ వితరణ

రామచంద్రపురం, జనవరి 28: విద్యోదయ చారిటబుల్ ట్రస్టు 9వ వార్షికోత్సవ వేడుకలు ట్రస్టు చైర్మన్ పెట్టా రాంబాబు అధ్యక్షతన స్థానిక జిల్లా ప్రజా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జి.వి.రావు మోడరన్ విద్యార్థుల ద్వారా సేకరించిన రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో డా.కె.వి.వి.సత్యనారాయణ, ఎం.వి.వి.సత్యన్నారాయణ, ఎం.ఇ.ఒ. మానుపూడి శ్రీనివాస్, సక్సెస్ గిరీష్ ప్రభు, వికాస్ రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ సమావేశం

మలికిపురం, జనవరి 28: వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు పిలుపునిచ్చారు. గుడిమెళ్లంకలో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ అడబాల రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. ఈ సభలో గుడిమెళ్లంకకు చెందిన గెద్దాడ సత్యనారాయణ, కట్టా వాసు, పెదపట్నంలంకకు చెందిన తూము సాయి, అంతర్వేదికి చెందిన పోలిశెట్టి గంగలతో పాటు మరో 50 మందికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ, మాలే శ్రీనివాసనగేష్, శివరామకృష్ణంరాజు, అచ్యుతరామరాజు, సతీష్, బాలాజీ పాల్గొన్నారు.

వద్దిపర్రులో సచివాలయ భవనం ప్రారంభం

ఆత్రేయపురం, జనవరి 28: మండలంలోని బొబ్బర్లంక, వెలిచేరు, వద్దిపర్రు, ర్యాలి, నార్కెడుమిల్లి, అంకంపాలెం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, రోడ్లు, డ్రైనేజీలను ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కుండా అన్నపూర్ణ, జడ్పీటీసీ బోనం సాయిబాబా, అప్కాస్ డైరెక్టర్ కప్పల శ్రీధర్, సర్పంచ్‌లు నరాలశెట్టి సుబ్బలక్ష్మి, వేముల శ్రీనివాసరావు, జుజ్జువరపు శ్యామల, పల్లేటి ధనలక్ష్మి, ముత్యాబత్తుల రాజు, పాలా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ర్యాంకర్లకు అభినందనలు

అమలాపురంటౌన్, జనవరి 28: అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇంగ్లీషు, నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో అమలాపురం శ్రీనంద్ స్కూలు విద్యార్థులు అత్యుత్తమర్యాంకులు సాధించి సెకండ్ లెవెల్‌కు ఎంపికయ్యారు. ఇంగ్లీషు ఒలింపియాడ్‌లో బి.నిషిత (4), వి.కార్తికేయన్ (120), నేషనల్ సైన్స్ ఒలింపియాడ్‌లో ఎం.సిద్విత (48), వి.కార్తికేయన్ (190), ఎస్.మల్లేశ్వరరావు (48) ర్యాంకులు సాధించారు. వారిని కరస్పాండెంట్ యెనుముల కనకదుర్గవిశ్వం, ఉపాధ్యాయులు అభినందించారు.

మద్యం స్వాధీనం

ఐ.పోలవరం, జనవరి 28: యానాం- ఎదుర్లంక చెక్ పోస్టు వద్ద ఆదివారం 35 యానాం మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రాజేష్ తెలిపారు. ట్రైనీ డీఎస్పీ పి.విష్ణు ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో 11మందిని అరెస్టు చేసి, రెండు కార్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.

రేపు నిరసన దీక్షలు

మలికిపురం, జనవరి 28: ఈ నెల 30న మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రాల్లో నిరసన దీక్ష చేస్తున్నట్టు రాష్ట్ర సర్పంచ్‌ల సమాఖ్య కార్యదర్శి చెల్లుబోయిన హెలీన తెలిపారు. సర్పంచ్‌లు 14 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ రాజకీయాలకు అతీతంగా నిరసన దీక్ష చేపట్టామని అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పెయింటర్స్ సంఘ అధ్యక్షుడిగా వెంకటరమణ

కాట్రేనికోన, జనవరి 28: శ్రీసూర్య పెయింటర్స్ సంఘం నూతన కార్యవర్గాన్ని కాట్రేనికోనలో ఆదివారం ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షునిగా రేవు వెంకటరమణ, గౌరవాధ్యక్షుడిగా వరసాల చిన్నారావు, ఉపాధ్యక్షుడిగా జగడం చినబాబు, బొంతు రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా సంగాని వంశీ, కార్యదర్శిగా అయితాబత్తుల మూర్తి, సంయుక్త కార్యదర్శిగా చిక్కం విజయదుర్గాప్రసాద్, కోశాధికారిగా వజ్రపు రమేష్ ఎన్నికైనట్టు ప్రకటించారు.

ఘనంగా బళ్లపూజలు

మామిడికుదురు, జనవరి 28: బాలబాలాజీ రజక అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో బళ్ల పూజలను ఘనంగా నిర్వహించారు. మామిడికుదురు గ్రామదేవత నూకాలమ్మకి చలిమిడి పానకాలు, మేకపోతును నైవేద్యంగా సమర్పించారు.